"... పెళ్ళికీ, ఉద్యోగానికీ లంకె పెట్టి నీ దృష్టిలో నా విలువను దిగజార్చారు మీ నాన్నగారు... ఆయన ఇప్పించే ఉద్యోగం కన్నా నీవే నాకు ముఖ్యం రాధా! నిన్ను నేను పోగొట్టుకోలేను. ఐ లవ్ యూ! నాకోసం నాకు ఉద్యోగం వచ్చేదాకా ఆగగలవా?"

ఆదిరాజు వేణుగోపా

ఒక్కోసారి ఆ రెండు కళ్ళను అరచేత్తో మూసి మరి తెరవనీయకుండా చేయా లనిపిస్తుంది. మరోసారి ఆ రెండు కళ్ళకూ అందకుండా దూరంగా పారిపోవా లనిపిస్తుంది. ఆ కళ్ళలో జీవం ఉండదు. నిరాసక్తంగా చూస్తూ ఉంటాయి. అటువంటి చూపుల్ని కేవలం తన వరకే పరిమితం చేసింది రాధ. అదే తను భరించలేకపోతున్నాడు.

కుర్చీలో అసహనంగా కదిలాడు విజయ్. ఉదయం నుంచి అతను గది బయటకు అడుగు పెట్టలేదు. ముందెన్నడూ లేనంతగా రాధ చూపులు ఆ రోజు అతన్ని బాధ పెట్టాయి. ఉదయం కాఫీ గ్లాసు తీసుకువచ్చింది. ఒక్క క్షణం అతని వంక చూసి కాఫీ గ్లాసు టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయింది.

ఆ చూపుని అత నెందుకో భరించలేకపోయాడు. మనసంత దిగులుతో నిండిపోయింది. అలాగే గదిలో కూర్చుండిపోయాడు. పన్నెండు గంట లవుతున్నది. తల్లిని పిలుస్తున్న రాధ గొంతు వినిపించడంతో తిరిగి ఆలోచనలో పడిపోయాడు విజయ్.

నాగభూషణంగారు ఎందుకు రమ్మన్నారో తనకు తెలుసు. తన తండ్రికీ, తల్లికీ తెలుసు. ఆ మాట కొస్తే రాధకీ తెలుసు. తనకి ఇష్టం లేకపోయినా తండ్రి బలవంతం మీద బయలుదేరక తప్పలేదు. ఇంట్లోకి అడుగు పెడుతున్న తనను చూసి నాగభూషణంగారు నవ్వారు. ఆ నవ్వు తనకు కోరలు చాచిన పాము నవ్వుతున్నట్లుగా అనిపించింది. తను రాగానే ముందు గదిలోకి వచ్చి ఒక్క క్షణం చూసి తిరిగి లోపలి కెళ్ళిపోయింది రాధ.

నాగభూషణంగారు తనకు ఎరవేయాల్సిన అవసరమేమీ లేదు. రాధ అందమైనదే. చుట్టా లమ్మాయిగా రాధతో తనకు పరిచయం కూడా ఉంది. ఎటొచ్చీ తను ఇక్కడకు వచ్చిన తర్వాతే పరిస్థితి మారింది. అందమైన ఆ నడుము చుట్టూ చేయి వేసి దగ్గరికి తీసుకోవాలన్న కోరిక, ఈ పది రోజుల నుంచి తనను పిచ్చివాణ్ణి చేస్తున్నది. రాధను తనకు కాబోయే భార్యగా కాకుండా మరే విధంగానూ చూడలేకపోతున్నాడు.

పెళ్ళి గురించిన ఊహలు అతన్ని మరింత అసహనానికి గురి చేశాయి. కుర్చీలో నుంచి లేచి కిటికీ దగ్గరికి వచ్చి నిలబడ్డాడు. వీథిలో పెద్దగా సందడి లేదు.

ఒంటిగంట అవుతుంతగా రాధ లోపలికి తొంగి చూచి అంది "భోజనానికి రండి." తిరిగి సమాధానం కోసం చూడకుండా వెళ్ళిపోయింది.

ఆకలిగా లేకపోయినా వంటింట్లోకి నడిచాడు. ముగ్గురికీ వడ్డించారు గాయత్రిగారు.

"మురళి ఏడీ?" కూర్చుంటూ అడిగాడు.

"పదకొండు గంటలకే వచ్చి తిని వెళ్ళాడు. ఇక మా అంకుల్ క్యారేజీ కోసం మనిషిని పంపించారు."

ఇంకేమీ మాట్లాడలేదు విజయ్. ఇద్ద రాడవాళ్ళతో కలసి తినవలసి వచ్చేసరికి ఇబ్బందిగా ఫీలయ్యాడు. ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ అనుభవంలోకి రాలేదు. ప్రతిరోజూ మురళి కాలేజీ నుంచి రాగానే ఇద్దరికీ వడ్డించేవారు. అతని అవస్థ చూసి రాధని కోప్పడ్డారు గాయత్రిగారు.

"చూడు! పరవాలేదు ముగ్గురికీ పెట్టమన్నావు. అత నెలా ఇబ్బంది పడుతున్నాడో చూడు!"

"అదేం లేదులెండి". మొహమాటంగా నవ్వుతూ. రాధ వంక చూశాడు విజయ్. ఆ క్షణంలో కూడా ఆ కళ్ళలో ఎటువంటి భావన కనిపించలేదు అతనికి. ఎలాగో అయిందనిపించి తిరిగి గదిలోకి చేరాడు.

గదిలోకి రాగానే తిరిగి ఆలోచనలు ఈగల్లా ముసుకున్నాయి. రాధకి త నంటే ఇష్టం లేదా? ఈ ప్రశ్నను చాలాసార్లు తను రాధను అడుగుదా మనుకున్నాడు. కాని వచ్చిన దగ్గర్నుంచి రాధతో మాట్లాడటం కుదరలేదు. రాధ ఆ అవకాశం ఇవ్వటంలేదు. అసలు తన మీద తనకే తక్కువ భావం కలుగుతున్నది. లోలోపల కుంచించుకుపోతున్నాడు. ఒళ్ళంత ఎండాకాలంలో లాగా దుమ్ము, చెమటతో తడిపోయి, అసహ్యంగా తయారైనట్లుగా ఉంది. ఎన్ని బకెట్ల స్నానం చేసినా ఆ చిరాకు తగ్గేటట్లుగా లేదు. రోజు రోజుకీ తను ఊబిలో కూరుకుపోతున్నాడన్న భావం అధికమవుతున్నది.

సాయంకాలం అయ్యేసరికి సన్నగా తలనొప్పి మొదలైంది. మూడు గంటలకు టీ తాగిన తర్వాత కొద్దిసేపు కళ్ళు మూసుకుని పడుకుందా మనుకున్నాడు. కాని ఆలోచనలు నిద్రను దగ్గరకు రానీయడంలేదు. ఆరు గంటలవుతుండగా, స్నానం చేసి బయటకు వెళ్ళటానికి తయా రవుతుండగా మురళి వచ్చాడు.

"ఏమిటీ, ఒంట్లో బాగాలేదా?" అడిగాడు విజయ్‌ని. "ఉదయం నుంచి ఎక్కడికీ కదలలేదని అమ్మ చెప్పింది."

"ఒంట్లో బాగానే ఉంది. కాని బయటకు కదలా లనిపించలేదు" నవ్వుతూ సమాధానం చెప్పాడు విజయ్.

మురళి సరదాగా ఉంటాడు. కాబోయే బావగారన్న గౌరవం ఇచ్చి మాట్లాడతాడు.

"బజారుకా?" తిరిగి అడిగాడు మురళి.

త లూపాడు విజయ్ "వస్తావా?"

"నేను ఇంకా స్నానం చేయలేదు. మీరు పదండి"

ఆ ఇంటి నుంచి బయటపడి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు విజయ్. బజారు వెంబడి నడుస్తుండగా పాత స్నేహితుడు రాంబాబు ఎదురయ్యాడు.

"బహుకాల దర్శనం" అతని చేయి పట్టుకుని ఊపేస్తూ అన్నాడు రాంబాబు. "ఏం చేస్తున్నావ్?"

"నిరుద్యోగం. నీవు?"

"నిరుద్యోగమే" నవ్వాడు రాంబాబు. "ప్రస్తుతం ఓ కాన్వెంట్‌లో టీచర్‌గా పని చేస్తున్నాను. అది చిరుద్యోగమో, నిరుద్యోగమో నీవే తేల్చుకో."

"నేను అదీ చేయటంలేదు" అన్నాడు విజయ్.

"ఈ ఊరొచ్చా వేం? చుట్టాలున్నారా?"

'అవు'నన్నట్లుగా తలూపాడు విజయ్. ఇద్దరూ కాలేజీ కబుర్లు చెప్పుకుంటూ సినిమా కెళ్ళారు. ఆ తర్వాత తన దారిన తాను వెళ్ళిపోయాడు రాంబాబు.

తిరిగి ఒంటరితనం ఆవహించింది విజయ్‌ని. నాగభూషణం గారింటికి వెళ్ళా లనిపించలేదు. ఆ రాత్రికి ఏ అరుగు మీదో పడుకుని, ఉదయాన్నే బస్సెక్కి సొంత కొంప చేరుకుంటే బాగుండు ననిపించింది అతనికి. అడుగులను లెక్క వేసుకుంటూ అతి కష్టం మీద ఇంటికి చేరుకున్నాడు. ముందు గదిలో కూర్చొని ఆఫీసు కాగితాలు చూసుకుంటున్నారు

నాగభూషణంగారు.

"సినిమా నుంచా?" అడిగారు.

తలూపుతూ లోపలికి నడిచాడు.

"ఏ సినిమా కండీ?" అడిగాడు మురళి.

సమాధానం చెప్పి బట్టలు మార్చుకుని వచ్చాడు. భోజనాలు అయిన తర్వాత తిరిగి తనకు కేటాయించిన గదిలోకి వచ్చేశాడు విజయ్. గది అంతా తన ఆలోచనలతో నిండిపోయి వేడి సెగలు కక్కుతున్నట్టుగా ఫీ లయ్యాడు. అన్ని కిటికీ తలుపుల రెక్కలూ బార్లా తెరిచి, మంచం మీద వాలాడు. కొద్దిసేపు అటూ ఇటూ దొర్లిన తర్వాత గాని నిద్ర రాలేదు. నిద్రలో కల.

రాధ పాల గ్లాసుతో వచ్చింది. పాల గ్లాసు పక్కన పెట్టి, ఆమె నడుం చుట్టూ చేయి వేసి దగ్గరకు లాక్కున్నాడు. కిలా కిలా నవ్వింది రాధ. నెమ్మదిగా ఆమె ఓణీని తప్పించాడు. రాధ నవ్వు ఆగిపోయింది. నెమ్మదిగా ఒకటొకటీ తప్పించి ఆమెను నగ్నంగా చేశాడు. తనూ నగ్నంగా మారిపోయాడు. ఆవేశంగా ఏదో గొణుగుతూ ఆమెను ఆక్రమించుకున్నాడు.

అంతలోనే కరెంటు పోయింది. కరెంటు పోయినా ఆ కళ్ళు తన వంక నిస్తేజంగా చూస్తూనే ఉన్నాయి. ఆశ్చర్యపోయా డతను. కరెంటు పోతే త నెలా ఆ కళ్ళను చూడగలుగుతున్నాడని.

తను ఆశ్చర్యపోతుండగానే ఆమె కడుపులో నుంచి ఒక అర చెయ్యి బయటకు వచ్చింది. ఆ అరచేతికి రెండు కళ్ళు... మూసి, తెరచి, మూసి, తెరచి నిర్లిప్తంగా చూడసాగాయి. అలా చూస్తుండగానే ఆ చేయి చటుక్కున మాయమైంది. అంతలోనే సన్నగా, అందంగా ఉండే ఆ నడుము బెలూన్‌లా ఉబ్బసాగింది. ఉబ్బి... ఉబ్బి పెద్ద చప్పుడు చేస్తూ చిట్లిపోయింది. ఒక వికృత శిశువు భయంకరంగా నవ్వుతూ మీద పడబోయాడు.

కెవ్వున కేక వేసి గది బయటికి పారిపోబోయాడు. గడియ రాలేదు. నగ్నంగా ఉన్నాడని బట్టలు వేసుకోవా లనుకున్నాడు. కాని మంచం దగ్గరికి వెళ్ళే ధైర్యం లేకపోయింది. అలాగే తలుపు దగ్గర నిలబడి రాధ వంక చూడసాగాడు. ఆ గాజు కళ్ళు తనలోని ఊపిరిని లాగి వేస్తున్నట్లుగా అనిపించింది.

కల చెదిరింది. ఉక్కిరి బిక్కిరి అవుతూ లేచాడు విజయ్.

గదిలో జీరో వాట్ బల్బు గుడ్డిగా వెలుగుతున్నది. కొద్దిసేపటికి గాని కాళ్ళూ,చేతులూ స్వాధీనంలోకి రాలే దతనికి. ఆ తర్వాత లేచి మంచినీళ్ళు తాగాడు. ఇక నిద్ర పట్టలేదు. తెల్లవార్లూ అలాగే ఆలోచిస్తూ కూర్చున్నాడు. తెల తెలవారుతుండగా ఒక నిర్ణయానికి వచ్చి బట్టలు సర్దుకున్నాడు.



కాఫీ గ్లాసు తీసుకువచ్చిన రాధ మంచం మీద సూట్‌కేసును చూసి ప్రశ్నార్థకంగా మొహం పెట్టింది.

"మా ఊరు వెళ్తున్నాను" నెమ్మదిగా అన్నాడు విజయ్.

కాఫీ గ్లాసు టేబుల్ మీద పెట్టి వెళ్ళబోయింది రాధ.

ఆమె చేయి పట్టుకొని ఆపాడు విజయ్. "ఉద్యోగం కోసం ఇంకొకరి సాయం తీసుకోవడంలో తప్పు లేదు. కాని పెళ్ళికీ, ఉద్యోగానికీ లంకె పెట్టి నీ దృష్టిలో నా విలువను దిగజార్చారు మీ నాన్నగారు. నేను కూడా వెర్రివాడి లాగా సూట్‌కేస్ పట్టుకుని మీ ఇంటి కొచ్చేశాను. మీ నాన్నగారు ఇప్పించే ఉద్యోగం కన్నా నీవే నాకు ముఖ్యం రాధా! నిన్ను నేను పోగొట్టుకోలేను. ఐ లవ్ యూ. నా కోసం నాకు ఉద్యోగం వచ్చేదాకా ఆగగలవా?"

రాధ కళ్ళలో మెరుపు మెరిసింది. అంత వెలుగును ఎప్పుడూ ఆ కళ్ళలో చూడలేదు విజయ్. ఆ క్షణాన తను తీసుకున్న నిర్ణయం ఎంత గొప్పదో తెలిసి వచ్చిం దతనికి. ఆమె నడుం చుట్టూ చేయి వేసి దగ్గరికి లాక్కున్నాడు. విడిపించుకోబోయింది. విడవలేదు విజయ్. చూపుడు వేలితో ఆమె గడ్డాన్ని పై కెత్తి కళ్ళలోకి చూస్తూ అన్నాడు. "మ రెప్పుడూ కూడా నా వంక అలా గాజు కళ్ళతో చూడకు, ఆ చూపులు కలలో కూడా నన్ను వెంటాడి భయపెడుతున్నాయి. నాకా చూపులను భరించే శక్తి లేదు!"

చిన్నగా నవ్వింది రాధ. కళ్ళలోను, పెదవుల పైన జీవం తొణికిస లాడుతున్న ఆ నవ్వును అలా చూస్తుండిపోయాడు విజయ్.

మృదువుగా అతని కౌగిలి విడిపించుకుంది రాధ. మునికాళ్ళ మీద లేచి అతని బుగ్గ మీద చిన్న ముద్ర వేసి, తూనీగలాగా బయటకు పరిగెత్తింది.

భూమి మీద ఇక దేనినైనా సాధించగల ననుకున్నాడు విజయ్. ★